ప్రాణనాయకి

వేలాల సుబ్బారావుగారు

౧

“సోమా! నీకిదివరకు ఎన్నిసార్లో నానిశ్చయాన్ని తెలియజేసి ఉన్నానుకదా. మరల మరల ఎందుకు నన్నీలాగు బలవంత పరుస్తావూ?”

“నీలాటి విదుషీరత్నం ఈలాగుదైన్యాన్నిపొంది పడుతూవున్న బాధనుచూడలేకా, పురుషులు మన విషయమైచేసే దౌర్జన్యాలను సహించలేకానూ. వాళ్లు పంతంబట్టినలాగు ఈమాదిరి దుండగాలు చేస్తూ వుంటే మనంవాటినన్నిటినీ చూస్తూ, భరిస్తూ చచ్చినలాగు పడివుండాలా ఏమి!”

“సోమా! పంతాలకూ, హఠాలకూ కాలంకాదిది. వానిని అవలంబించడం మూర్ఖులలక్షణం. అందరమూకలిసి బాగుగా నాలోచించుకొని ఏమార్గాన్ని అవలంబించడంవల్ల ఈ ప్రస్తుత నవీననాగరికతాప్రభావ సంజనితనవనవోన్మేషఝంఝామారుతంతో చిక్కి ఊగులాడుతూవున్న మన జీవికానౌకను సురక్షితంగా ఈ సంసారసాగరాన్ని దాటించి గట్టుకుచేర్పించగలమో ఆమార్గం స్వీకరించాలి. పురుషులు మనవిషయమై వారివిషయమై మనమూ హఠదురాగ్రహాలను బూని పరస్పరం దౌర్జన్యాలను చేసుకొంటూఉన్నామని అనుకోడంకూడా సరియైనదికాదు. ఎవరెన్ని యేలాటిప్రయత్నాలు చేస్తూవున్నా సమస్తమూ వారి వారి భాగ్యానుసారం జరిగిపోతూవుంటుంది. అట్టిచో విపత్తికలిగినప్పుడు తొందరపడిన లాభంలేదు. ఆలాటి సమయాన్ని ధైర్యమూ, శాంతమూ ఆశ్రయించడమే మంచిది.”

“జానకీ! నీమాటలునాకు బొత్తుగా సరిపడడంలేదు. నాకే నీలాటి అవస్థసంభవించి ఉన్నట్లయితే మొన్న ఈనడుమ మనమద్రాసుకాంతలుచేసిన వివాహవిచ్ఛేదపు తీర్మానానికి ప్రథమతాంబూలం పుచ్చుకొని ఉండేదాన్ని ఈపాటికి. ఇంతమాత్రం ధైర్యంచేయలేకపోతే ఇకమనం సంపాదించిన ఈడిగ్రీలెందుకూ? తగలెయ్యనా? మనంనేర్చుకొన్నదానిమూలాన్ని మనకే ఉపకారం కలక్కపోతే ఇక పరోపకారమేమిటీ మండేది? నీలాటి పట్టభద్రలే తెగించి ఈలాటి పురుషులని గడ్డి దినిపించకపోతే ఇక తక్కినగుంటలేమిచేసేది? ఓ అంటే నారానిదిక్కుమాలినపక్షులు.”

“సోమా! అత్యంతదీనావస్థలో ఉన్ననూ నాకిపుడు నీమాటలు కొంచెం నవ్వును తెప్పిస్తున్నాయి. విద్యవలన మనుష్యులు పొందదగినది ఐహికాముష్మికసౌఖ్యం. కాని ఆముష్మికచింత ఇప్పుడు బొత్తిగా ఎగిరిపోయింది. మొన్న మనమద్రాసు కామినులుచేసిన పరిష్కారంవిషయమై వారిని అనవలసిన పనిలేదు. అది సమయప్రభావం, కాలప్రవాహం మహావేగవంతమైంది. అందులోపడకుండా, పడి కొట్టుకొనిపోకుండా తప్పించుకోడానికి శక్యంకాదు ఎవరికీ. ప్రస్తుతం పాశ్చాత్యులు అధికారపదములో వుండడంచేత వారిపద్ధతులు మనలను భ్రమింపజేయకమానవు. వారితళుకుబెళుకులు మనధీరులనే అంధులనుగా చేస్తూఉంటే అంగనల మాటేంచెప్పాలి? మనుజులకు అభిప్రాయాలు బాల్యయౌవనవృద్ధావస్థలలో వేరువేరుగా ఉంటాయి.

ఎవరికివారు తాముతలపెట్టిందే ఉత్తమమనీ, దాని ప్రకారమే నడుచుకొనితీరాలనీ, పట్టుబట్టుతూవుంటారు కాని మొదటి రెండుదశలలోని అభిప్రాయాలకంటే, పరిపక్వదశయందలి అభిప్రాయమే సంఘాభివృద్ధికి శ్రేయస్కరమని అందరూ ఒప్పుకొంటారు. పాశ్చాత్యుల ప్రస్తుతావస్థ బాల్యందాటి యౌవనంలోపడుతూ వుంది. కాని భారతీయదశ పరిపక్వావస్థనుండి అధఃపతనాన్నిబొందింది. పడుతూవుండగా పడినతరువాత చుట్టూ ఆవరించుకొన్న నానావిధకుసంస్కారాలు అసలు సభ్యతనురూపుమాపినాయి కాబట్టే ఇప్పటి మన వారికి ఇతరుల తళుకుబెళుకులు భ్రమలను కలుగచేస్తూ ఉన్నాయి; కాని ఈలాటిదూరపుకొండలనునుపు భ్రమలలో పడకుండా కుసంస్కారాలను తొలగించుకొన్నామూ అంటే చాలు. మరల మనసభ్యతానూర్యుని ముందు పరులతళుకుబెళుకుమిణుగురుపురుగులు కంటికేకానరావు. సోమా! మనంనేర్చినవిద్యవలన మనకు ఉపకారంకలగడంలేదని భావించడమూ వెర్రితనమే. దేనిచేతగాని తాత్కాలికలాభంకలక్కపోతే అది దానిదోష మనడానికి వీలులేదు. మంచిచెడ్డల దెలియజేసి బాగును అవలంబింపజేసేదో అదేవిద్యకాని పైపూతలవలన మనకును ఆకర్షింపజేసి అనుచితకార్యాల్లో ప్రవేశపెట్టేది విద్యకాదు సుమా! మొదలు అమృతప్రాయంగావుండి చివరకు విషంగా పరిణమించేవి కొన్నీ, మొదలే విషంగావుండి అంతానికి అమృతప్రాయంగామారేవి మరికొన్నీనీ. ఈ రెండురకాల కార్యాలనూ బాగాగుర్తించాలి. అదే మనంసంపాదించిన విద్యకుఫలం. భారతీయసభ్యతకూ, పాశ్చాత్యసభ్యతకూ స్వర్గపాతాళాల అంతరముంది చూడు. వారిదేశం వేరూ, మనదేశంవేరూ; వారిమతాలు వేరు, మనమతాలు వేరూ; వారిఆచారవ్యవహారాలు వేరూ, మన ఆచారవ్యవహారాలు వేరు; వారిసంప్రదాయాలు వేరు, మనసంప్రదాయాలు వేరు; వారి యాహారపానాదులు వేరు, మన యాహారాదులు వేరు; వారిప్రస్తుతపురాజకీయపరిస్థితి వేరు, మనదాస్యపరిస్థితి వేరు; వారిఆదర్శాలు వేరు, మన ఆదర్శాలు వేరు. ప్రతివిషయంలో వేరువేరుగాఉన్న మనం వారినిఅనుకరించాలని కోరుకోడం ఎంత ఉచితమో ఆలోచించు. సోమా! మనుష్యజాతి పొందదగినసమస్తమునూ పొందడానికి కావలసిన సౌకర్యాలన్నీ మన సభ్యతలో ఉన్నాయి. వాటినన్నింటిని మరల పైకితీసుకొని రావడమే మనకర్తవ్యం. దానివలన విద్యాగంధంలేని మనసోదరీమణులకేకాదు సమస్తప్రపంచానికీ మేలవుతుంది. ఇక స్త్రీపురుషులు పరస్పరం అవమానపరచుకొనవలసిన అవసరంఏమి? ప్రకృతినియమాలనుబట్టి మనమందరమూ నడుచుకోవలసిందేకాని మనమీద పురుషులును, వారిమీద మనమూ దురాగ్రహాలను పెట్టుకొని ప్రకృతివిరుద్ధంగా మెలగడం మనతరం కాదు. కేవలం హాస్యాస్పదం."

"జానకీ! క్షమించు. నీ మనోదార్ఢ్యం గుర్తింపక మనదేశంలోని విద్యావంతుల సేపులు పాశ్చాత్య రీతులను ఆమోదించుచుండడంచేత, మీదు మిక్కిలి ఆనటువిటాగ్రేసరుడుగారే నీపేర సేమో వ్రాసియుండడం చేత లిన్నగ విచారింపకుండా ఏమేమోచెప్పి నీమనసునకు బాధకలిగించేను. నీవిపుడు చెప్పినసంగతులూ గమనించదగినవే."

" ఇందులో నిన్ను క్షమించవలసిందేమున్నది, సోమా! నీకు తోచిన అభిప్రాయం నీవు వెల్లడిస్తే నామదిలోని ఉద్దేశం నేను తెలియపరచేను. ఇంతమాత్రంచేతనే మనమును నొప్పికలుగునా? పాశ్చాత్యులనుండి మనంనేర్చుకొనదగిన విషయాలనేకములున్నాయి. కాదనుట నాతరంకాదు. కాని అధిపత్యంపొందిఉన్నకారణాన్ని వారినీతినియమాలనన్నిటినీ స్వీకరించితీరాలి అనేనిర్బంధంలేదు. బాగా ఆలోచించూ. మనదేశంమీద విదేశీయుల ఆక్రమణమున్నది. లేకుండా ఉండినకాలంలో—అత్యంతప్రాచీన కాలంలో— మానపూర్వులాచరించుచుండిన నీతులూ, రీతులూ, వ్యవహారాలూ, అప్పటి సాంఘిక నియమాలూ మిక్కిలి ఉత్కృష్టమైనవి. అవికేవలమూ భారతీయ సంఘోపయోగములేకాదు—సార్వదేశిక సంఘోపయోగములని నాతాత్పర్యం. ప్రస్తుతం మనవారిలో అవివేకులు వారినమసరించడానికి కారణం ఇప్పుడే

223

చెప్పేనుగదా! ఒకరిమాట ఎందుకూ? జాలంధరువెళ్లడానికిపూర్వం నాయుద్దేశాలూ అలాగే ఉండేవి. స్వకీయ వస్తుయోగ్యతా అనభిజ్ఞతయే అందులకు ముఖ్యకారణం; కాని చింతలేదు. ఎవరి ఆచారవ్యవహారాలను అనుకరించాలనని మనవాళ్లు ఉవ్విళ్లూరుతూ ఉన్నారో ఆపాశ్చాత్యులు మనప్రాచీనులాచరించియుండిన వాటినే అవలంబిస్తూ ఉన్నారు. కాని కొన్నిఅతిశయాలతో, కొన్ని అతిక్రమణాలతో, కొన్నిలోపాల తోను. ఈఅతిశయాలు మొదలైనవి కలగడానికికారణం పాశ్చాత్యులిప్పుడు ప్రయోగావస్థలో ఉండడమే. అవలంబించి ఉన్నవానిమూలంగా క్రమక్రమంగా లాభనష్టాలు బయల్పడకపోవు. అప్పుడు నష్టముగలిగించే వాటిని వదిలి లాభదాయకములైనవాటిని గ్రహింపకనూపోరు. అంతలో మనమూ మనకర్తవ్యం కొంతవరకు నెరవేర్చుకొందుమేని చివరకందరకులభించేది మన ప్రాచీనులదశయే. దురభిమానంలేదు. ఇది సాహార్దకాభిప్రాయం."

"ఎవరో లోపలనుంచి పిలుస్తున్నారు."

'జానకీ' అనిలోపలనుండి మరలవినరా—

"కమలాంబగారు లాగున్నది."

"అవును. మాఅత్తగారే. నేను లోపలికివెళ్లి వస్తాను. కూర్చొనిఉండు."

"కూర్చోదంకాదు. నేనిప్పుడు హి. యు. సాకు వెళ్లాలి. సాయంకాలం క్లబ్బునుంచి ఇంటికి వెడుతూ మళ్లీకలుస్తానులే. నీవీక్షలాలకు రావడం బొత్తుగా మానేశావుకదా జానకీ! మనవాళ్లందరు నిన్నెంతో తలుచుకొంటూవుంటారు."

"సోమా! కాని! రాత్రిగడచిపోదూ!"

అని జానకి లోపలికి వెళ్లగానే సోమావతి హిందూయువతీ సంఘములోజరుగు మీటింగునకై వెళ్లిపోయింది.

౨

"There is a Divinity that shapes our ends,
Rough—hew them how we will."

అని ఆంగ్లేయ కవికులసార్వభౌముడు వచించినలాగు మనమెన్ని విధాల ప్రయత్నం చేస్తున్నప్పటికీ వాటినన్నింటి తప్పుడు మార్గాలకు బట్టించి మన భాగ్యచక్రాన్ని త్రిప్పుతూఉండే దైవికశక్తి ఒకటిఉంది అన్నిటినీమించి. ఇందులకు తార్కాణంగా సమస్తయోగ్యతలను గలిగి ఉండియు అనేకులు దారిద్ర్యదేవతా సుపుత్రులై ఉండడం, ఎందులకూ కొరగాని వారు శ్రీసంపన్నులై ఆనందాల తేలుతూ ఉండడం మనం తరుచూగా చూస్తూనే ఉన్నాము. ప్రస్తుతం ఒక మంచి జమీందారీఎస్టేటుకు రిశీవరుగా ఉన్న పెన్షనడ్ డిప్టీకలెక్టర్ రామేశ్వరరావుగారికి ఒక్కతేకూతురు జానకి. స్వదేశమందేకాక విదేశాలలో కూడా పేరు ప్రతిష్ఠల పొందుతూఉన్న రాఘవరావు M.A., Mus. M; M.O.D.S; గారి ధర్మపత్ని – మామగారు సర్కారు వారిచ్చే పెన్షను అనుభవిస్తూ ఉన్న ఒక హైకోర్టుజడ్జి–కాని; పిశినిగొట్టుకాదు–మహోఉదార స్వభావం కలవాడు అన్ని విధాలానూ–వీరినామధేయం సుందరరావు. ఇక ఈమె అత్తగారో సాక్షాత్తు లక్ష్మీదేవి. చదువుచెప్పిన కోడలిని జూచి చీదరించుకొంటూ మహారాణిగారనీ, దొరసానిగారనీ సంబోధనలతో ఎత్తి పొడుస్తూఉండే అత్తగార్లవలె గాక కోడల్ని తన కడుపున గన్న కూతురులాగు జూచుకొనే దొడ్డ ఇల్లాలు.

224

బంధు వర్గం, సెనిమిటి మొదలగు వారిమాట అలాగు ఉండగా స్వయం జానకి మద్రాసు విశ్వవిద్యాలయానికి అలంకారభూతలైన పట్టభద్రలలో ఒకతె. ఇంతేకాదు. ఆసేతుహిమాలయం హైందవబాలికా విద్యాపీఠాల్లో ప్రసిద్ధికెక్కి ఉన్న పంజాబులోని జాలంధరునగరస్థకన్యామహావిద్యాలయనామకరత్న సంస్కారకర్మాగారంనుండి సంస్కృతినిబొంది వెల్వడిన రత్నాలలో ఒకతెకూడాను. రూపమందేమైన దక్కువా? సౌందర్యాధిదేవతావిలాసభవన మీమె సుకుమారశరీరం. కమలాయతలోచన యగు నీ సువర్ణగాత్రిని జూచు వృద్ధదంపతులందరూ "హా! మాకీలాటి పుణ్యఫలపంట లభింపదాయె"నని తమ భాగ్యాన్ని నిందించుకొంటూ ఉంటారు. అకస్మాత్తుగా క్షణమాత్రమైన జాలు. ఈ గులాబీపువ్వును చూడడంతటస్థించిన యువకుల నేత్రాలు ఫొటోగ్రాఫు లెన్సులయొక్కయు, హృదయఫలకాలు నెగేటివ్ ప్లేట్లయొక్కయు ధర్మాల నవలంబిస్తూ ఉంటాయి.

ఈలాగు ఇహలోకసౌఖ్యాలను అనుభవించడానికి గావలసిన సాధనసామగ్రులన్నీ ఈమెదగ్గర పుష్కలంగా ఉన్నప్పటికీ పాపమీ జవ్వనికాలాటి భాగ్యంలేదని ఇంతవరకు సోమావతితో మాట్లాడినదానిని బట్టి చదువరులు గ్రహించే వుంటారు. దీనికి హేతువేమిటి? నామట్టుకు నేను పైన వ్రాసిన 'There is a Divinity' ఇత్యాదివాక్యాలసారాంశమే హేతువనుకొంటాను. కాని లౌకికంలో మనమీలాగుకల్పించుకో వచ్చు అదే కారణాన్ని.

రామేశ్వరరావు సుందరరావు లిద్దరూ విద్యాధికులగుటే కాక వీరి ఆశయాలుకూడా చాలా విశాలమైనవే. కావున తమ సంతానాలకు మంచి విద్య పట్టు బడడానికి కావలసిన సదుపాయాలన్నింటిని చేశారు. రాఘవరావుకు చిన్నప్పటినుంచి సంగీతం అంటే మహాప్రేమ. ఇతని నోటివెంట అప్రయత్నంగానే వెడలుతూ ఉంటాయి రాగాలాపాలన్నీ వేళాపాళాలేకుండా ఎల్లప్పుడూ. సకలవిధాలా ఇతని పురోభివృద్ధినే అభిలషిస్తూ ఉన్నతండ్రి ఇతనికి సంగీతమందున్న అభిరుచిని గనిపెట్టి దాన్నికూడా పెంపొందించుకొనడానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు. సూక్ష్మబుద్ధిగల కొమారుడు శ్రద్ధతో రెండువిద్యలలో పరిశ్రమ సలుపుతూ క్రమంగా 17 ఏండ్లునిండు నప్పటికి అటు మెట్రిక్ ప్యాసయి ఇటు సంగీతంలో చాలా వరకు గడతేరేడు. భావిజీవితంలో అనేకపరివర్తనాలను కలుగజేసిన ఇతని నాటకసమాజప్రవేశం ఈ సమయమందే ఘటించింది. నటుల వేష పరివర్తనాలవలె యువకులజీవితాలను సైతం చిత్రవిచిత్రంగా మార్చి వేస్తుంటాయి ఈ నాటకరంగాలు. దేశమందలి లౌకిక నైతికస్థితులలోగల లోపాలవలన వీని మూలకంగా లాభం పొందినవారికంటే నష్టపడిన వారే ఎక్కువమంది. వీనికి గలుగవలసినంత జనాదరణసహితమైన గౌరవము కలుగక పోవుటకూ ఈ లోపాలే కారణాలు. కాని మన రాఘవరావుకు మాత్రం తాత్కాలికనష్టం ఏమీ కలుగలేదు. క్రమంగా రెండు సంవత్సరాలు దాటేసరికి ఇంటర్మీడియేటుసర్టిఫికేటుతోబాటు నాటకరంగంమీద సర్టిఫికేట్లు, పతకాలూ గూడా లభించేయి. అదిగాక స్వదేశంలోని తక్కిన నాటకరంగాలతో సరసమానమైన స్థితిలోనికి గొనితెచ్చి కీర్తిసన్మానాలపొందవలె ననే దృఢమగు అభిలాషఒకటి పుట్టింది ఇతని మనసులో. ఈకోర్కను పూర్తిచేసుకో డానికి స్వదేశమంతగా సాధ్యంకానందున విదేశంపోవలెనని నిశ్చయించుకొని అందులకు ప్రయత్నంచేయ సాగేడు. కాని ఒక ఆటంకంవల్ల అప్పటికాకోర్కను వెనుక బడవేయవలసి వచ్చింది. ఈ సంవత్సరమే ఇతనికి జానకితో వివాహమైంది. పెన్షనుదార్లిద్దరూ సహాధ్యాయులూ బాల్యస్నేహితులునై యుండడం జానకీరాఘవుల వివాహ మింత తలవని తలపుగా చెయ్యడానికి కారణం. వివాహంనాటికి జానకికి 15 ఏండ్లు

ఆలోపారంలో చదువుతూ ఉంది. ధనం గలవారిబిడ్డలు కావడంచేత ముందుముందు విద్యాభివృద్ధి నిమిత్తం ఏవిధమైన లోటుపాటులుండవనే నిశ్చయంతో వివాహం మాత్రం చేసివేశారు. కాని రాఘవరావుకు విదేశగమనాభిప్రాయంపోలేదు.

వివాహమై ఒకసంవత్సరం గడచిన తరువాత జానకికూడా మద్రాసుకేవచ్చి చదవడమారంభించింది. వీరి సహవాసం మూలాన్ని విద్యాభివృద్ధికేమాత్రం ఆటంకం కలక్కపోవడం. అలాగు ఉండగా వారికది తోడ్పాటే కలుగజేసింది. ఉత్తమశిక్షితయగు నీభామిని విద్యావిషయమై కావలసిన సమస్తసహాయాన్నీ భర్తవలన గైకొనుచు దమ ఇద్దరి చదువున కేమాత్రం హానికలుగక ఉండేలాగున మెలగుతూ వచ్చింది. మరియు మద్రాసువంటి నగరంలో విద్యాసంపన్నులైన యువతీయువకులు అనుభవింపగల నానావిధాలైన సౌఖ్యాల నుండియు వీరు వంచితులుగా ఉండలేదు. దేశహితానికనీ, సంఘాభివృద్ధికనీ నగరంలో ఏర్పడి ఉన్న సమాజాలలో వీరికీ ఉంది ప్రవేశం. కాని ఎచటికి పోయినప్పటికి భార్యాభర్త లిరువురు జంటబాయకుండా వుండే వారు. ఈలాటి ఆనందభోగాలలో మరి రెండు వర్షాలు రెండునిముషాల్లాగు గడిచిపోయినాయి. రాఘవరావు బి. ఎ; లో, జానకి ఇంటర్మీడియేటులో జయమును పొందేరని బంధుమిత్రాదుల కందరికి అపరిమిత సంతోషం గలిగినప్పుడు ఇక అసలువారికి గలిగిన ఆనందానికి పరిమితి వున్నదా? అనంతరం రాఘవరావు ఇంగ్లండుపోవలెనని మరల పట్టుపట్టి ఆ విషయమై తనభార్యతో అనేకసార్లు ప్రస్తావంచేశాడు. ఎందువల్లనో ఆమె మనసునకది సమాధానంగా లేకపోయినప్పటికీ పెనిమిటికనుకూలంగానే సమ్మతినిస్తూ వచ్చింది. తుదకేలాగయితే నేం? తలిదండ్రులను, భార్యనూ, తక్కిన సమగ్రబంధువర్గాన్నీ సమాధానం చేసికొని యూరోపుకు ప్రయాణమై వెళ్లిపోయినాడు.

3

రాఘవరావు వెళ్లిపోయిన తరువాత ఒకటి రెండు నెలలపర్యంతం అతని ఎడబాటువల్ల కలిగిన వ్యాకులంచేత జానకి విమనస్కురాలై ఏమీ తోచకుండా ఉంటూవచ్చింది. కాని విద్యాభివృద్ధి యెడల గల దృఢానురాగం ఈమె చింతలను పారద్రోలి కర్తవ్యపరాయణనుగా జేసింది. అక్కడ నూతనప్రదేశావలోకనకౌతూహలం చేతా, మీదు మిక్కిలి నాట్యనాటకకళాపారంగతుడు కావలయుననే ఉత్కట ఉత్సాహంచేతా రాఘవుని గూడా భార్యనువదలుటవలనకలిగిన దుఃఖమంతగా బాధించింది కాదు. భార్య భారతవర్షంలో, పతి పరదేశంలో వారి వారిమనోరథాలు ఫలింపజేసుకోడానికి ప్రయత్నిస్తూ వచ్చారు. పరస్పరలిఖితప్రేమపత్రాలు చేతులకందగా వానిని జదువుకున్నంత సేపూ కలిగే అన్యోన్యస్మరణాల వలన ఉదయించే ఆవేగంమూలాన్ని మనస్సులు పరిపరివిధాల పోతూవున్నప్పటికీ తుదకేలాగో వాటిని జిక్కబట్టుకొని యథాప్రకారం తమ తమ విధులను నెరవేర్చుకొంటూనే వచ్చేరు. జీవితమధ్యకాలంలో సంభవించే అనేకవిధములైన ఘోరములనుండి దూరగులై సుఖంగా కాలం గడపడానికని పరమదయాళుడగు ఈశ్వరుడు మఱపనే మహౌషధాన్ని ప్రసాదించినాడు నిర్మలహృదయాన్వితమైన మానవజాతికి. దినక్రమేణ కలిగిన ఇట్టి విస్మరణమే వీరిని మరల కార్యతత్పరులనుగా జేసింది. ఉచితకాలంలో నిచట మద్రాసు విశ్వవిద్యాలయాన్నుంచి బి.ఎ. పట్టాన్ని సంపాదించినది జానకి. అక్కడ రాఘవరావు M.A, Mus. పట్టాలను బొంది M.O.D.S. బిరుదాన్ని గూడా గైకొన్నాడు.

స్వచ్ఛమైన నీటిబిందువు మలినప్రదేశములోబడి అపవిత్రమై పోతుందనీ, కాగేడు ఇనుపరేకుమీద మాయమైపోవుననీ, సముద్రములోబడి ముత్తెమౌతుందనీ భర్తృహరి వచించియున్నాడు. ఇదే ప్రకారం విద్యకూడా ఆశ్రయోపాధిని బట్టి అనేకవిధాలుగా మారుతూవుంటుంది. స్వార్థపరుడూ, లోభాగ్రేసర

226

చక్రవర్తి అయిన ఒక న్యాయాధిపతియందు ప్రవేశించి విస్పష్టమైన న్యాయాన్ని అన్యాయంగా, అన్యాయాన్ని న్యాయంగా నరునికి జూపిస్తూ ఉంటుంది ఇదేవిద్య. ఆశాపాశాలలో గట్టువడి ఉచితానుచితములను మరచిన అజ్ఞానాంధుడైన ఒక వర్తకుని కుంభోదరమందు దూరి సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా పలికిస్తూ వుంటుంది నిరాఘాటంగా, నిస్సంకోచంగా, తొణుకూ బెణుకూ లేకుండా యిదేవిద్య. దురాచారుడూ దుస్స్వభావుడూ కుక్షింభరుడూనైన ఏ పురోహితుని యొక్కరో, లేక ఏ ఉపదేశకుని యొక్కరో తలకెక్కి ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా శ్రోతలకు బోధించేలాగు అతనిని ప్రేరేపిస్తూంది ఇదేవిద్య. విశుద్ధమైన అంతఃకరణగల ఒకమహానుభావుడు లోకోపకారానికేనైన మంచి యంత్రావిష్కారం చెయ్యాలనని ప్రయత్నిస్తూఉంటే తద్విపరీతస్వభావుడైన తస్కరసార్వభౌముడు లోకుల కొంపలను దీయడానికి బనికివచ్చు యంత్రావిష్కరణానికి ప్రయత్నిస్తూవుంటాడు అదేవిద్యాప్రభావాన్ని. సన్మార్గుడైన భూమిపాలకుడు తన ఏలుబడిలో ఉన్న ప్రజలందరూ ఐకమత్యంతో సౌఖ్యంగా కాలంగడుపుతూ అభివృద్ధిపొందడానికి దగిన ఉపాయాలను అవలంబిస్తూ ఉంటే అందులకు విపరీతవర్తనంగల భూపాలనాయకుడు ఐకమత్యాన్ని అడవులపాలు జేసి గర్ధభాండాలవంటి సౌఖ్యాలతో, ఆకాశప్రసూనాలవంటి అభివృద్ధులతో లోకులందరూ త్రాహి త్రాహి యని భగవంతుని దలచుకొనేలాగునచేసి తాను మాత్రం స్వోదరపూరణం చేసుకొంటూ ఉంటాడు అదేవిద్యాసహాయాన్నీ. పుట్టుకతో పుట్టిన బుద్ధి పుడకలతోగాని పోదనినట్లు విద్యవలన అసలు స్వభావం మారదు. పైగా ఉన్నదాన్ని మరింత బలమైనదాన్నిగా జేస్తూవుంటుంది. ఈ విద్యను చాటు జేసుకొని తన ప్రకృతిని మరింతనిపుణంగా ఉపయోగించుకొంటూఉంటాడు మనుజుడు. కారణాంతరసంయోగంచేత శుద్ధప్రకృతిపరివర్తితదశను బొందినప్పటికీ తత్కారణనిర్గమనమైనవెంటనే మరల శుద్ధత్వం బొందడమూ సహజమే. ఇందులకు జానకీ రాఘవు లిద్దరూ ఉదాహరణాలే.

జానకి నైజంగా ఉత్తమస్వభావం కలది. కాలేజీలలో చదువుతూ ఉండిన కాలంలో ఈమె మెలగుతూవచ్చిన సంఘప్రభావంచేత, అభ్యసించే విద్యామహిమచేతా ఈమె ఆచారవ్యవహారాలన్నీ వేరుగానే ఉండేవి. కాని ఈ కథ వ్రాయునాటికి అవన్నీ బొత్తుగా మారిపోయినాయి. చదువుకొనే రోజులలో ఈమె యువతీయువకసంఘాలకు వస్తూపోతూ ఉండేదని ఇదివరకే సూచించి యున్నాను గదా. డిగ్రీ చేతికందేసమయానికి దక్షిణప్రాంతంలో సుప్రసిద్ధులని ప్రసిద్ధిబొందిన వక్త్రినులలోనొకతె అనేపేరు గాంచినది ఈమె. ఎక్కడ స్త్రీసమాజాల ఉత్సవాలైనా ఈమెకుగూడా టెలిగ్రాఫు ఆహ్వానాలు వస్తూ వచ్చేయి. తగినంత అవకాశము లేకపోవడంచేత కొందరిప్రార్థనలనూ తిరస్కరించవలసివచ్చిందిగదా అని చింతిస్తూకూడా ఉండేది అప్పుడప్పుడు. ఇక మద్రాసునగరంలో ఈమెకు తెలియకుండా జరిగే సభలు ఉండేవే కావు. మిస్. సోమావతి ఈమె చిరస్నేహితురాలు. సోమ జూనియర్‌లో ఈమె సీనియర్ క్లాసులో (ఇంటర్) ఉండగా వీరిద్దరికీ స్నేహం కుదిరింది. అదిమొదలుకొని అక్కచెల్లెళ్లలాగు ఎడబాయకుండా విద్యాభ్యాసముచేసి ఇద్దరూ పైకివచ్చేరు. ఈడూ, జోడూ, స్వభావాలూ కలిసినమైత్రి వీరిది. ఒకరి సౌఖ్యాన్ని గురించి ఒకరు శ్రద్ధతీసుకొంటూఉంటారు.

చదువుతూ వున్నంతకాలం జానకిపాశ్చాత్యులనే అనుకరిస్తూ వుండేదని వ్రాసియున్నాను. అలాగు వుండకవిధిలేదు. వంట బట్టినభాష విదేశీయం. మాని వేషభాషలుగూడా దాని కనుకూలంగానే వుండేవి. “హిందువులంత కృతఘ్నులూ, హిందువులంత అసత్యవాదులూ ప్రపంచమందలి మరి ఏజాతిలోను లేరు. అందులో బ్రాహ్మణులు ప్రత్యక్ష బ్రహ్మరాక్షసులు. స్త్రీలకూ శూద్రులకూ చదువే పనికిరాదని బోధించిన ధూర్తులు. వీరల పురాణాలన్నీ రంకుపురాణాలే. సోమపానం పేరుపెట్టుకొని సారాయి తప్పదాగి మతి

227

తప్పిపోయిఉన్న సమయంలో ప్రేలిన ప్రలాపాలు వీరి వేదాలు. ధర్మాధర్మాలను నిరూపించే యాజ్ఞవల్క్యుడు లాటిధర్మశాస్త్రకర్తను గొడ్డుమాంసం ఉంటేనేగాని మెతుకుదిగేది కాదు గొంతులోకి. వీళ్ల దేవుళ్లందరూ జారశిఖామణులే. ఇన్ని అవస్థాలూ, ఇన్ని అవకతవకలూ, ఇన్ని దుర్నీతులూ, ఇన్ని దుండగాలూ ఉన్న జాతి కాబట్టే చివరకు పాతాళానికి పోయేగతిపట్టింది. మాకిలాటి దౌర్భాగ్యపు జాతిలో పుట్టేమనుకోడానికే తలవంపుగా ఉంటుంది. మనవంటి అనాథలమీద గనికరించి ప్రభువుపంపిన భాగ్యదేవతలాగు ఆంగ్లేయ పరిపాలనం లభించబట్టి దక్కివున్నాంగాని లేకపోయిన యెడల ఏశూలంమీదనో, ఏకాష్ఠంమీదనో, ఏ గంగలోనో బడి చెల్లుకొని ఉండేవాళ్లమే ఈపాటికి. దైవవశాన్ని మనకులభించిన ఈ అమూల్యమైన అవకాశాన్ని చేతులనుండి జారపోనీక సంపూర్ణమైన లాభంపొంది తీరాలి........."

ఈలాటి సారాంశాలతో దసే నిండి వుంటూవుండేవి సాధారణంగా ఈమె స్వదేశం స్వజాతి అభివృద్ధికని పేరుబెట్టి ఆకాలంలో యువతీయువకులతో కిటకిటలాడుతూఉండే వ్యాఖ్యానశాలల్లో వినిపిస్తూ వచ్చిన లెక్చర్లన్నీని. ఇది ఈ ముగ్ధకన్యకల దోషం లేశమాత్రం కాదు. ప్రస్తుతం ఆసేతుహిమాలయ పర్యంతభారతవర్షంలో ప్రచారంలో ఉన్న విద్యాప్రభావం. గొప్ప గొప్ప కాలేజీలనే పేరుతో హైందవుల జ్ఞానాన్ని అభివృద్ధిచేసి వారి భాగ్యాభాగ్యలను నిర్ణయించడానికనీ, కోట్లకొలది దేశీయద్రవ్యరాసులతో నిర్మింపబడియున్న ఈ విద్యాపీఠములలో ఉపయోగింపబడే పఠనీయగ్రంథాలన్నీ, విదేశీయుల కీర్తి ప్రతిష్ఠలనూ వారి వీర్యశౌర్యసాహసములనూ, వారి యాచారవ్యవహారములనూ పొగడుతూఉంటాయి; కాని హిందూ దేశానికి సంబంధించినదేమీ ఆగ్రంథాల్లోఉండదు. ఉండకపోయినా చింతలేదు. మీదు మిక్కిలి ఈ పఠనీయ గ్రంథాలలోని స్వదేశీయనిరసనాలు బాలికాబాలకులకు మనసులందు ప్రవేశించి తమవారి యెడల విపరీతభావాలను గలిగించడానికి కారణాలవుతూ ఉంటాయి. వింత వింత వస్తుప్రదర్శనశాలలతో విశాలగ్రంథాలయములతో ఈ నవనీతకోమలాంతఃకరణులైన బాలికాబాలకులబృందముల నడిపించుకొని పోయి అచట వారికి జూపించి బోధించేదేమిటి? కార్న్‌వాలిస్, క్లైవ్, మన్రో, నెయిల్ విగ్రహాలూ వారువారుగావించియున్న ఘనకార్యములూ. ఈలాటి గ్రంథములను జదించుటవలన, వీలాటి ఉపదేశాల నాలకించుటవలన నిశ్చయంగా స్వదేశ, స్వమత స్వధర్మాలమీద వెగటూ విదేశంమీద విధర్మాలమీద అనురాగం కలుగకమానదు. దిక్కుమాలినన్ని మనదేశానికి జెందిన గ్రంథాలున్నాయి. వాటిని జదువ గూడదా అంటారేమో అవన్నీ పఠనీయగ్రంథాల్లోరావు. ఆ వున్నవీ విదేశీయులభిక్షాలే. వాటిలో నూటికి 99 పాళ్లు విదేశీయుల విద్వజ్ఞానాల గానాలాపాలతో, అసలు గ్రంథములలోని కొరవలు కొరతలను ప్రదర్శించే ఉపోద్ఘాతాలతో ఆరంభమై అనువాదకుల విశ్వాసాలకూ, ఉద్దేశాలకూ అనుకూలంగా ఉండే లెక్కలేని టీకాటిప్పణీలతో ముగింపునుబొందుతూవుంటాయి. వీటిని పఠించుటవలననూ కొంచె మించుమించుగా పైన వ్రాసిన పరిణామమే లభిస్తూవుంటుంది పాఠకులకు; కాని వాటినైనా జూడడానికి అవకాశం దొరకాలికదా. పరీక్షాగ్రంథపఠనాలతోనే పెద్దలు తలపునకువస్తూవుండగా ప్రాణాలుఎగిరి పోతూవుంటాయి. ఇక దక్కినవాని జూచేదేమిటి? పరీక్ష పూర్తిఅయిన మర్నాటినుంచీ (రిజల్ట్సు ఇంకా రెండు నెలలకుగాని బయటబడవు) నౌకరీలకోసం సర్కిట్లతో సరిపోతుంది. పరీక్షలో ప్యాస్ కాకపోయిన మళ్లీ వేరొక కాలేజీలో సుఖజీవనం చేయనేవచ్చు. లేక కర్మంజాలక ఉత్తీర్ణమైన యెడల ఏ ఉద్యోగిప్రభువు వారి అండనో ఆశ్రయించి తిట్లకు వెరువక, కొట్లకు జరవక, శాపాలకు చెదరక, దిగదుడుపులకు బెదరక, అవమానాలకు జంకక, అపహాస్యాలకు గొంకక బండలాగుబనిచేస్తూ ఉంటే సూర్యుడు ఎటు బుట్టి ఎటు

228

అస్తమించేది కూడా తెలియకుండా గడచిపోతుంది ఐహికజీవితజాలం యావత్తూనూ. కాబట్టి స్వకీయ గ్రంథాల్లోని మంచి చెడుగుల గురించి తెలుసుకోవడానికి అవకాశమే దొరకదు మనవారికి. ఈ హేతువు చేతనే దక్షిణమందున్నంతవరకూ జానకి పాశ్చాత్యనాగరికతాశిష్యురాలుగనే ఉంటూవచ్చింది; కాని తరువాత జరిగిన ఒకఘటనంవలన ఈమె జీవితంబొత్తుగా మారిపోయింది. ఈమె బి.ఎ. ప్యాసయిన సంవత్సరమే రామేశ్వరరావుగారు కుటుంబసమేతంగా కాశ్మీరం పోవడం తటస్థించింది. అంతవరకు ప్రతిఎండాకాలంలో ఉదకమండలంవంటి ఏ శీతలప్రదేశానికో పోయి గడుపుతూ ఉండేవారు. కాని ఈతడవ కాశ్మీరప్రయాణం పెట్టుకొన్నారు. భూలోకస్వర్గమనదగిన కాశ్మీరమందలి నందనవనతుల్యమగు తద్రాజధాని శ్రీనగరంలో ఒక విశాలసుందరమైన హౌసుబోటునందు వాసంగుదుర్చుకొని మూడు నెలలపర్యంత మచట దర్శనీయ స్థలాల నవలోకిస్తూ దివ్యసౌఖ్యాలననుభవించి మరల గృహోన్ముఖులై వీరు ఇతిహాసప్రసిద్ధంబైన మార్తాండమందిరం, తక్షశిలా, లాహోర్, అమృతసరం మున్నగు ప్రదేశాల మీదుగా జాలంధరు నగరం చేరేరు. ఈపట్టణం కన్యామహావిద్యాలయానికి ప్రసిద్ధికెక్కినదని ఈమె అదివరకూ చాలాపర్యాయాలు విని ఉండెనుకాని చూడడంమాత్రం సంభవించినదికాదు. అచట దిగి ఆ మహావిద్యాలయమును చూచుటకుబోయినప్పుడు ఆ సంస్థయొక్క ప్రథమదర్శనమే ఆమె మనసు నాకర్షించింది. కొంతకాల మక్కడనే వసించి ఆర్యలలనలసాంగత్యసౌఖ్యమనుభవించవలెనని ప్రబలమగుకోరిక జనింప దానిని దండ్రికి తెలియ బరచింది. అతడునూ అందుల కామోదించి యామెనక్కడనే దిగవిడిచి తక్కినవారితో స్వదేశంవచ్చి చేరేడు. ఆ ఉండడం ఉండడం ఈమె అక్కడ రెండేండ్లపర్యంతమున్నది. అచట ఈమె గావించిన ఆర్షగ్రంథపఠనంచేత ఈమె కంతకు బూర్వముండిన అభిప్రాయాలనేకములు మారిపోయినాయి. పశ్చిమ పూర్వవిద్యలసమ్మేళనమున నీమెయందొక అపూర్వనిశ్చయం జనించినది. ఆనిశ్చయంయొక్క స్వరూపం కొంతవరకు మొదటి ప్రకరణంలోని సోమావతీసల్లాపాన్నుంచే కనుగొనవచ్చును.

౪

కన్యాగురుకులవాసంచేతనూ, ఆర్యావర్తభ్రమణంచేతనూ దానుసంపాదించిన అనుభవాన్ని స్వదేశమందలి సోదరసోదరీమణులకు నివేదించి ఉపకారజనితపుణ్యంతోబాటు కీర్తిగౌరవాలను పొందవలెననే మహోత్సాహంతో జానకి మద్రాసునగరానికి తిరిగివచ్చింది. కాని విధినియతి వేరొకలాగు ఉండినది. సంగీతకళానిధియై, నాటకరంగకుశలుడై భారతీయనాటకసంస్థలను మహోన్నతదశలోనికి దీసుకొని రావాలననే ఉత్కటాభిలాషతో లండను నగరంజేరిన రాఘవరావు నాలుగుసంవత్సరాలు గడచుననగా స్వకర్తవ్య పరాఙ్ముఖుడు కావడమే ఇచట అతనిధర్మపత్ని విఫలమనోరథయగుటకు కారణము. కార్యసిద్ధికి ఇంద్రియనిగ్రహమావశ్యకం. అందులో రాఘవరావు తలపెట్టినటువంటి కార్యానికి అత్యంతావశ్యకం. ఈ విషయమందే ఇతడు దెబ్బదిన్నది. దీనిలో మెలకువగలిగి ప్రవర్తించియుండినయెడల నిజముగ నితడుతలపెట్టినకార్యం నిర్విఘ్నంతరముగ నెరవేరి తరువాత స్వదేశానికికూడా మేలుగూర్చజాలియుండేదేకాని జయాపజయాలు మనచేతిలోనివికావు. కృష్ణమిశ్రుడు వచించినలాగు కేవలదృష్టిప్రసారాలే చాలు స్త్రీపురుషుల మనసులను గలతపెట్టడానికి. అట్లాంటప్పుడు ఎట్టిబాంధవ్యం లేని యువతీయువకులు స్పర్శనచుంబనాలింగనకరపీడనాదుల నిరాటంకంగా నెరవేర్చుకొంటూ ఇతరులెవరైన నడిగినచో తాము కేవలం అన్నచెల్లెండ్రవలె మెలగుచున్నామని చెప్పడం ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. మొదలుమొదలిట్టివారిస్నేహం సోదరీసోదరభావంతోనే ఆరంభం గావచ్చును; కానినిరంతరసాహచర్యంవలన గాలాంతరమందు దట్టిభావం ఉండడం దుర్ఘటమేకాక అసంభవంకూడానూ.

ఈసోదరీసోదర భావం ఎంత సూక్ష్మంగా పరివర్తనం పొందుతూ ఉన్నదీ వీరు గ్రహింపజాలరు. వైజయంతీ విలాసకారుడు వచించినలాగు యువతీయువకుల నిరంతరసహవాసంమూలాన్ని వజ్రసన్నిభమైన మానసం లోహమై, గ్రావమై, దృఢదారువై, తరుణవృక్షమై, ఫలమై, పూవై, అందలిమకరందమై, నీరమై, అంతకంటె పలచని పెట్రోలియమై హృదయాగ్నిచే భగ్గుమనలేచిన జ్వాలాసమూహంలోబడి సోదరీసోదర భావమూ, నయమూ, భయమూ, సిగ్గూ, బిడియం, ధర్మం, కర్మం అన్నిఒక్కపెట్టున భస్మంకాకుండా వుండడం నైసర్గికానికి కొంతవిరుద్ధమే. ఈలాటి నైసర్గికవిరుద్ధాలే ఘటిల్లుచో తత్కారకులైన శుక, ఋష్యశృంగుల మూలంగా భారతవర్షంయొక్క భావి పండినదన్నమాటే.

స్వదేశమండలి యువతీయువకుల సంఘాలలో నిర్భయంగా మెలగనేర్చిన రాఘవరావువంటి వానికి కూడా ఇంగ్లండుచేరిన మొదటినెలలో అచటిస్త్రీల విశృంఖలవృత్తిజూచి కొంచెంసంకోచంగలుగుతూ వచ్చింది; కానిఒకనెలగడచేసరికి అదిమాయమైంది. ఇతనికిగల సూక్ష్మబుద్ధి, వాకచక్యం, సంగీతమండలి నేర్పు, నాట్యమండలినైపుణ్యం. కలియగలుపువనం అన్నీకలిసి కొన్నివారాలకే ఇతనికపరిమితమైన స్నేహితులనూ, స్నేహితురాండ్రనూ చేకూర్చిపెట్టేయి. ఇంగ్లండులోని ప్రధాననగరాలన్నింటిలో హైందవ సంగీతనాట్యకళావిశారదుడని పేరు మోగిపోయింది. ఆర్టులో, మ్యూజిక్ లో మాస్టర్ డిగ్రీలనుపొందేడు. అక్స్ఫోర్డుయూనివర్సిటీ డ్రమాటిక్ సొసయిటీవారు మెంబరుపదవినిచ్చి సన్మానించారు. నాలుగుఏండ్లు పూర్తిగావచ్చేయి. ఇదేసమయాన్ని హిందూదేశానుంచివచ్చిన మిస్. లలితఅనే యువతియొకతె ఇదే క్షేత్రంలో పనిజేయుచుండిన కారణాన్ని దైవికంగా వీరిద్దరికీ నేస్తమైంది.

కొన్నాళ్లపర్యంత మిద్దరూ అక్స్ఫర్డువారు ప్రదర్శించే హిందూనాటకాల్లో నాయికా నాయకుల పాత్రలుధరిస్తూవచ్చేరు. ఇక్కడ ఈలాగు ఉండగా పారిస్ నగరాన్నుంచి రాఘవరావుకు మరొక ఆహ్వానంవచ్చింది. అచటి ఒక సుప్రసిద్ధ ఫిల్మ్ ప్రొడ్యూసింగ్ కంపెనీ ప్రొప్రయిటరు ఇతనికి నెలకు రెండువేల ఫ్రాంకు లిచ్చే ఏర్పాటుమీద హిందూపురాణాలకు చెందిన ఫిల్ములకు నాయికానాయకుల వేషాల దాల్చు నిమిత్తం లలితనుగూడ తీసికొని రావలసిందని కోరేడు. ఇక గావలసిందేమిటి? నాట్యనాటక కళాభివృద్ధితోబాటు ద్రవ్యార్జనంకూడా లభించిందని సంతోషంగా పారిస్కు ప్రయాణమై వెళ్లేడు లలితను వెంటబెట్టుకొని.

అక్స్ఫర్డులోనైతేనేం, పారిస్ లోనైతేనేం లలితారాఘవు లిద్దరూ సాధారణంగా నాయికా నాయకుల పాత్రలనే ధరిస్తూవచ్చేరు. కాబట్టి మనస్సులలో మొదలు ఆలాటి వాంఛలు లేకపోయినప్పటికీ, పాత్రాభినయానికిగాను ఆయాసమయాల్లో స్పర్శన, ఆలింగన, చుంబనాదులనూ తప్పనిసరిగా చేసికోవలసి వచ్చేది. సాధారణంగా నాటకకంపెనీలలో నాయికానాయకుల వేషాలను ధరించేది పురుషులే అయినప్పటికీ చిరకాలం అట్టిపాత్రల దాల్చుచుండుటచేతనే కావచ్చును వారిద్దరికి ఒకవిధమైన అనురాగంమాత్రం ఏర్పడుతుంది. అట్టిసమయంలో నిండుయౌవనంలో ఉన్నస్త్రీపురుషులమీద ఆలాటి వేషధారణ ప్రభావం మరింత ప్రబలంగాపడినదంటే ఆశ్చర్యమేముందీ? లలితారాఘవుల స్నేహం దినకర్మాన్ని అభివృద్ధియైనకొలదీ పైనవచించిన స్పర్శచుంబనాదులు కేవలంనాటకరంగాల్లోనేకాక పార్కురంగాల్లో, హోటల్ రంగాల్లో హాలిడేరిజార్ట్ రంగాల్లో ఇంకెందుకూ అట్టికార్యాలకు అవకాశందొరికే సకలరంగాల్లోకూడా జరుగుతూ వచ్చేయి. తరువాత క్రమంగా ఒకరినివిడచి రొకరికి ఉండడానికే కష్టమనిపిస్తూవచ్చింది. లలితపై

230

వ్యామోహం పొందిన మొట్టమొదటిదినం జానకీ స్మరణ మితన్ని మహాబాధించింది. ఆనాడు తన సాధ్వి యెడల క్రూరుడై యీలాటి ద్రోహం చేయడం మహాపాతకమని యతని అంతరాత్మ బోధనల వలన కలిగిన హృదయవేదనలచేత కళ్లనీళ్ల పర్యంతం గూడా అయింది. కాని మరునాడు లలితను కలిసికొన్నపుడు ఆమెతో యథాప్రకారం ప్రేమసల్లాపాలాడేడు. ఆరంభదినమందు అణుమాత్ర స్వరూపంలో ఉదయమందిన లలితావిషయిక వ్యామోహం దిన దినాభివృద్ధిపొందుతూ తుదకు మహాపర్వతపరిమాణం గాంచినలాగు ఇందుకు విపరీతక్రమాన్ని మొదట కొండంతలుగనుండిన ధర్మపత్నీవిషయిక అనుతాపం క్షీణిస్తూ క్షీణిస్తూ చివరకు అణువై పరమాణువై అంతర్ధానం పొందింది. లలితాదత్తఉపగూహనచ్ఛలమహనీయమహనీయాభోగాలముందు దూరమందలి భార్యాస్మరణం రవంతైనా పనిచేసిందికాదు. ఆఖరుకు ఇంద్రియాల పాశవికబలానికి వివేకబలం లొంగిపోయింది తరువాత వచటి యొక్క వివాహపు చట్టంప్రకారం Miss లలితా Mrs రాఘవలలితగా మారిపోయింది. ఈ విషయమై సమస్తమూ యింటివారికి దెలియబరచి జానకికి ఆమె ఇష్టంవచ్చినలాగున ఉండవచ్చునని కూడా వ్రాశాడు. కన్యాగురుకులవాసానికి బూర్వమే ఇది సంభవించి యుండినచో ఈమె యేలాగు నడుచుకొనియుండెడిదో తెలియదు. కాని ఈ సమయాన్ని మాత్రము మగని వ్యవహారం యెడల నత్యంతదుఃఖితయయ్యు ధైర్యమవలంబించి ఆదర్శక భారతీయ రమణీవ్రతనిష్ఠయే ధరించుటకు నిశ్చయించుకొన్నది. దుర్వ్యసనానిమగ్నులై కృతఘ్నులూ, దురహంకారులూనైనపతులు తామే సర్వస్వతంత్రులమని నిర్రసీల్గుతూ అత్యాచారములజేయ గడగినప్పటికీ వాటి నన్నింటి కడుపున బెట్టుకొని ఓర్పుతో మెలకువతో వానికి గావింపవలసిన ప్రతివిధానముల సలుపుచు చివరకు తమ సతీత్వ ప్రభావంచేత తమ కార్యనిర్వాహణసఫలతచేత తమ్ము, తమవారలను తమ వంశములను నుద్ధరించుకొని కీర్తిగడించిన తల్లులగన్న దీ భారతవర్షము. నిజానికి పాతివ్రత్యరక్షణార్థం సుకుమారశరీరాలను అవలీలగా నగ్నిహోత్రునకర్పించి బలిదానమొనర్చిన సతీమణుల అభిదానస్వర్ణాక్షరపంక్తులు హైందవఇతిహాసములలో దప్ప మరియే ఇతిహాసములలో దొరకవు. మా యంతటి సభ్యశిరోమణులే లేరని చంకలు గొట్టుకొనుచు ఆధునిక పాశ్చాత్యసభ్యత మొన్న మొన్న కన్నులు తెరిచింది. కాని ఆర్యసభ్యతకు ఆదే లేదు. ఆనేక విద్యలలో విఖ్యాతికెక్కి కొమ్ములు దిరిగిన విద్వాంసులనేకులు ఒక్కటూదిరిగా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆర్య సభ్యతయొక్క ఆదిని కనిపెట్టడానికి వీరితరం కావడంలేదు. ఈ మధ్యకాలంలో ఎన్ని సభ్యతలో రంగస్థలం ప్రవేశించి నాట్యమాడి మరల తెరలోనికి పోయినాయి. కాని ప్రస్తుత ఇతిహాసానికి గోచరం కాని అత్యంతప్రాచీనకాలంనుండి ఇంతవరకూ నిలచి ఉన్నది హైందవార్యసభ్యత ఒక్కటే. ఇందులకు హేతువేమిటి? భారతీయ కాంతారత్నాలే. సంఘనిర్మాణానికి, సంఘబలానికి, సంఘస్థితికీ ఉత్తమసతులే కారణం. గృహిణి లేనిచో గృహమేమిటి? మనుజమాత్రులమైన మనం అల్పజ్ఞులము. కష్టసుఖాలు దైవాధీనాలు. ఎవరినిమిత్తంచేతనైనా కష్టాలు కలిగిన ధైర్యముతో, నేర్పుతో, శాంతంతో వాటిని తొలగించుకొని నిలుపుకొంటే కాపురాలు నిలుస్తాయి; కాని మగని వెడలనడచి, బిడ్డలను బారదోలి, తాను బరుగెత్తి ఇంకోచోట చేరలేవా? అక్కడకూడా ఈలాగే సంభవిస్తే—జానకియొక్క స్నేహితురాండ్రందరూ వచ్చి ఎవరికి దోచిన సలహాను వారిస్తూ వచ్చేరు. మొట్టమొదట సోమాజానకీల సంభాషణం ఈలాటి ఒక సందర్భంలో జరిగిందే. ఈమె కావించుకొన్న నిశ్చయానికి విరుద్ధంగా ఎవరెన్నివిధాల వాదించినప్పటికీ వారల వాక్యాలు ఈమె మనసును ద్రిప్పడానికి చాలేయికావు. భారతమందు బుట్టిన భారతీయవిదుషి భారతీయ స్త్రీత్వానుంచి దూరం గావడానికి సమ్మతించిందికాదు. కలంకరహితమైన ఆర్యజాతిని అనాదికాలాన్నుంచి నేటివరకూ నిలిపినదీ, నిలిపేదీ ఈలాటి సాధ్వీతిలకాలే.

౫

కాలవశాన్నో లేక హిందువుల దుష్కర్మవశాన్నో ప్రస్తుతం అధోగతిపాలై ఉన్నప్పటికీ పూర్వమొక సమయమున ఆధ్యాత్మికవిద్యయందు ఉన్నతశిఖర మధిరోహించి సమస్తప్రపంచమునకూ గురుభూతమై యుండినదీ భారతవర్షము. అతిశయాలకు పోక ఉచితరీతి ఐహికానందాల ననుభవిస్తూ ఆత్మజ్ఞానాన్ని పొందడమే భారతీయ సభ్యతయొక్క పరమావధి. కాబట్టి ప్రాచీనమహర్షులు రాజకీయ, ధార్మిక, సాంఘిక నియమాల నన్నింటినీ పరమావధి ప్రాప్తి నిమిత్తం చేయవలసిన ప్రయత్నాలకు అనుకూలంగా ఉండి నిశ్శ్రేయససిద్ధికి తోడుపడే వానిగా నిర్మించుకొనిరి కాని అన్యథా కాదు. ఈ కాలమందలి సభ్యతయొక్క పరమావధి ఐహికసుఖప్రాప్తి కేవలం—కాబట్టి ఇప్పటివారి నియమాలన్నీ దాని కనుకూలంగానే చేయబడి ఉన్నాయి. పైన వ్రాసిన రాజకీయాదులలోని ఒక్కొక్క విషయానికీ ఆత్మజ్ఞానప్రాప్తి కవసరమైన ప్రయత్నాలకూ గల సంబంధాన్ని వివరించి వ్రాయాలనంటే అప్రస్తుత ప్రసంగ మధికమౌతుంది; కాబట్టి ఆ విషయాన్నిగురించి యోచించి చూచుకొనుట చదువరులకే వదలుతాను. ధార్మిక, సాంఘిక, నియమాలలో ప్రధానస్థాన మివ్వదగినది వివాహపు కట్టుబాటు - దీనియొక్క బలాబలము మీదనే, దీనియొక్క పవిత్రాపవిత్రల మీదనే, దీనియొక్క గురుత్వాగురుత్వముల మీదనే, దీనియొక్క పాలనాహేలనముల మీదనే సమగ్రసంఘస్థితి ఆధారపడిఉన్నది. ఇది రవంత పటుత్వం తప్పినయెడల లేక లేశమాత్రం మలినత్వం పొందినయెడల సంఘంకూడా శిథిలమై, అపభ్రంశమై, సంకరమై పోవడం నిశ్చయం. ఈలాటి సంకరాలచేత నపవిత్రములై జీవనం సలుపుతూ ఉన్న సంఘాలెన్నో ఇప్పుడు మనకళ్లయెదుట ఉన్నాయి. సంకరజాతులకు పరమావధి ప్రాప్తి ఉండనీయండి. అధోగతి మట్టుకు తప్పక లభిస్తుంది. పరిమితరీతి ప్రాపంచిక సౌఖ్యాలను అనుభవిస్తూ, ఆత్మజ్ఞానలబ్ధియందే ముఖ్యంగా ధ్యాసంగలిగిన సతీపతులు తత్సంబంధములైన వ్రతదీక్షానుష్ఠానాది ధార్మిక కార్యాలలో నిమగ్నులై నిరంతర ప్రయత్నములను చేస్తూ నియతాహారవిహారులై సాత్వికగుణప్రధానులై లోకసంస్కృతి కొరకు సంతానముల బడయుచూ, ఆ మరణాంతం ఎడబాయక ఆత్మశాంతిని గలిగి చివరకు శరీరాలను వదలుతూ వచ్చేరు కాని, ఆధునికనాగరికతావలంబుల్లాగు ఐహికపాశవిక సౌఖ్యాన్నే పరమావధిగా పెట్టుకొని నాస్తికులై, భక్ష్యాభక్ష్య వివక్ష లేక సర్వభక్షకులై, మాదకద్రవ్యద్రవ సేవలమూలమున శరీరాలు మదించిపో ఇష్టంవచ్చినంతకాలం కలసివుండి కామోద్రేకం శాంతించిన తోడనే ఏదోఒకవంక నెపంగల్పించుకొని విడిపోవుచూ, అవసరమైతే ఎనుబది ఏళ్ల ప్రాయమందైనా మరల నంట గట్టుకొంటూ జీవనమంతా మహా ఆర్భాటంగాబుచ్చి తుదకంతసమయాన్ని కూడా అశాంతితో దేహముల వదలు నవీననాగరికతా ఉపాసకులవలె, నశించలేదు. ఈ వివాహసంస్థయొక్క ప్రాధాన్యాన్ని బాగాగుర్తెరిగి ఉండడంచేతనే ప్రాచీనకాలమందలి మహర్షులు గుణకర్మస్వభావాలు, కులశీలాలు, తక్కిన శుభలక్షణాలు అన్నీఅనుకూలంగా ఉంటేనే, అలాటి వధూవరులకే గార్హస్థ్యధర్మం విధించేరు; కాని ఆధునికసంఘనిర్మాణానికై కంకణాలు గట్టుకొని ఉన్నమహర్షులు స్వేచ్ఛాప్రణయదేవత నొకదాన్ని సృష్టించి దానిముందు పూర్వోక్త కులశీలాదులను బలి ఇప్పించేరు. వాటికన్నింటికీ స్వాహా అయిపోయింది. కులశీలాలు గంగలో పడనీ, గుణకర్మస్వభావాదులు బావిలో మరకనీ, శుభలక్షణాదులు సముద్రంలో గూలనీ, పరవాలేదు - స్వేచ్ఛాప్రణయదేవత ప్రత్యక్షమైనచాలు. ఆ దేవికి తృప్తిగలిగే వరకూ హాయిగా స్త్రీపురుషులు కలిసి ఉండవచ్చు; చెల్లబడడంతోటే మళ్లీ ఎవరికి వారే యమునా తీరే కావచ్చును. ప్రాచీనులుకూడా గాంధర్వం స్వీకరించారంటారేమో. ఆ గాంధర్వానికీ ఈ గీర్వాణానికీ చాలా భేదంఉంది. అదిసంఘ నిష్పాదకం, ఇది సంఘవిచ్ఛేదకం. దైవోపహతులైన భర్తలు దమ్ము నిరసించినగాని త్యజియించినగాని శకుంతలా, దమయంతీ, సీతా మున్నగు సతులు ప్రతినియమధారిణులై యనేకకష్టముల సహించి మరల తమతమ పతులనే చేపట్టేరు గాని మొద

232

వారికి తిలోదకాలిప్పించి మరివకరినీ వారూ కాకపోతే ఇంకొకరిని గ్రహింపలేరు. వీరూ స్వేచ్ఛా ప్రణయం చేత ప్రియులను చేపట్టిన వారే. కాని ఆ కాలపు సభ్యతయొక్క ఆదర్శమే వేరుగ నుండెడిదని చెప్పియున్నాను గదా. ఈ ప్రాచీనవవీన స్వేచ్ఛాప్రణయాలకు సంక్రాంతి పీర్లపండగల కున్నంత తారతమ్యం ఉంది. ఈ ఆధునిక స్వేచ్ఛాప్రణయావిర్భావప్రభావంచేతనే లలితాంబగారితో రాఘవుని మంగళకార్యం సంపన్నమైంది. మొదట ఆమె కులగోత్రాలేమిటో, పుట్టుపూర్వోత్తరాలేమిటో విచారించ వలసినంత అవసరమే కలిగింది కాదు ఇతనికి. సాక్షాత్కరించిన నూతన స్వేచ్ఛాప్రణయదేవతానామక అంజనశైలవినిర్గతగాఢాంధకారవినష్టీకృతజ్ఞానచక్షువైన రాఘవున కప్పుడు తన హస్తపాశాల్లో చిక్కిఉన్న లలితాకోమలగాత్రస్పర్శనజనితసౌఖ్యందప్ప మరొకటిగోచరించినదే కాదు. ఇక అడిగేదేమిటి ? కాని కాలక్రమంగా కులగోత్రాదులగురించి ఏమీ తెలియక పోయినప్పటికీ ఈమె పూర్వేతిహాసం కొంచెం బయటపడింది. కలకత్తాలోని వేశ్యలవ్యాపారి ఒకడు కుల్లూ, చంబా ప్రాంతాలనుండి వెంటబెట్టుకొని వచ్చిన ఒక అనాథబాలిక లలిత. తలిదండ్రులెవరైందీ తెలియదు. ముందు ముందు లక్షలకొలది ధనాన్ని ఆర్జించి తన సేత్తిని బరిగిస్తుందనే పుట్టెడాశతో పాపమీ వ్యాపారి ఈలాటి గౌరవనీయ వృత్తివల్లనే సంగ్రహించిన వేలకొలది రూపాయలను వ్యయం చేసి సంగీతనాట్యకళాదుల్లో మంచి ప్రావీణ్యం కలిగేలాగుజేశాడు. కాని మంచివ్యక్తి వచ్చిన రెండుమూడు సంవత్సరాల కల్లా కలకత్తా ఆర్యసమాజంవారి నాశ్రయించి వారుచేసిన భగీరథప్రయత్నం వలన ఈమె ఆ వ్యాపారి జాలంనుంచి తప్పించుకొని సామాజికుల సలహామీద అజ్మీర్ నగరంచేరింది. ఏలాగైనా ఈమెను ఉద్ధరించాలననే సదుద్దేశంతో సమాజంవారు రాజపుటానా యందలి ఒక ధనాఢ్యుడైన రయీసునకిచ్చి పెళ్లిచేశారు; కాని రయీసుగారిపై మోజు ఒకసంవత్సరంలోనే పాతబడిపోవడంవల్ల వారికి నామంబెట్టిపోయి బొంబాయిచేరి అక్కడ స్వయంగానే వ్యాపారంజరిగించుకొంటూ వచ్చింది తగినంత తెలివిగలది కావడంచేత. బొంబాయినివాసకాలమందే ఈమెకు యూరోపియను సర్తకీల సహవాసంచేకూరింది. పిదప కొన్నాళ్లకు వారిలో నొకరితోగలసి పశ్చిమభూమిఖండం ప్రవేశించింది. అక్కడ మిస్ లలితా నామంతో సభ్యసమాజాలలో, బాల్సుల్లో, సినిమా ఫిల్మ్‌ప్రొడ్యూసింగ్ కంపెనీలలో డాన్సులలో ఎక్కడజూచిన తానేఅయి సకలవిధాలా ద్రవ్యార్జన చేస్తూవచ్చిన కాలంలో మన రాఘవరావులోనే సంకుదిరింది; కాని తిరుగేకాలు ఒకచోట నిలచి ఉంచడం కష్టం. ఒకటి రెండేండ్లయినా గడిచెనో లేదో రాఘవునకించుక ఆరోగ్యంతప్పిఉన్న సమయాన్ని నతనికి స్వస్తిచెప్పి నవీనమకరందాస్వాదనం చేయడానికో చేయించడానికో మరొక ప్రదేశానికి వెళ్లిపోయింది. యౌవన మదంచేత కన్నూమిన్నూ తెలియకుండా తిరుగులాడే యువకులను నిద్రనుంచి మేలుకొలిపే ఈలాటి ఘటనాలే. లలిత వెళ్లిపోయిన తరువాత నితనివ్యాధి మరింత పెరగడం మొదలెట్టింది. దానిని జూచి ఇతడామె నిమిత్తమే వ్యామోహంపెట్టుకొని ఈలాగు కృశించిపోతూ ఉన్నాడని అతని మిత్రులందరూ అనసాగేరు; కాని యదార్థకారణం అదికాదు. స్వేచ్ఛాప్రణయదేవతాకారణాన్ని అనుగ్రహాలెంత త్వరలో ఉద్భవిస్తారో విగ్రహాలూ అంత త్వరలోనే అవిర్భవిస్తాయి. లలిత గావించిన ద్రోహం మూలాన్ని విరాగమందిన ఇతని మనస్సులో ఇప్పుడామెకులవ మాత్రమైనా అవకాశంలేదు. కాని అదిమొదలుకొని ఇతనిని అనుతాపంలో ముంచి శరీరాన్ని కంపింపచేస్తూ ఉన్నది జానకియొక్కయ మాయికమనోహరస్వరూపం. ఆస్వరూపాన్ని దలచుకొని దలచుకొని ఏడ్వనిదినమూ, కలవరింపని రాత్రీ, తేడినట్టూప్పవదలని ప్రహరమూ, అనుతాపమొంది హాయనని ఘడియ, స్మరించని నిమేషమూ లేదు. ఇదే యతని రోగమెక్కువగా దినక్రమమున గృశించి పోవుటకు కారణము. అటుతరువాత నప్పటికీ విదేశములో నుండుటకే మనసొప్పలేదు. కావున అచటనుండి బయలుదేరి బొంబాయిచేరి మహాలక్ష్మివాడలో నొక

సామాన్యభవనాన్ని అద్దెకు తీసుకొని అక్కడే ఒకమాదిరిగ ఏకాంత వాసంచేస్తూ వచ్చినాడు. ఎవరో ఇద్దరు ముగ్గురికి దప్ప దానటకు వచ్చిన వార్త మిత్రుల కందరికీ తెలియపరచలేదు. తాను దనఅర్ధాంగి యెడల గావించిన ద్రోహానికి తగిన శిక్ష భగవంతుడే విధించినాడని శాంతంతో దాని ననుభవిస్తూ కాలంగడప నెంచుకొన్నాడే కాని ఇంటికి దన వార్తను దెలియబరచుటకు సాహసించిన వాడు కాడు. ఈలాగు కొన్ని నెలలు గడచుసరికి రోగం మరింత మిక్కుటమైపోయింది. అనుభవజ్ఞుడైన డాక్టరొకడు ప్రతిరోజూ వచ్చిచూస్తూ ఒకమందు పట్టలేదని దానిని మార్చి వేరొకమందు నుపయోగిస్తూ తన శక్తివంత వినియోగించి పనిచేస్తున్నప్పటికీ లాభం లేశమాత్రమైనా కనుపించడంలేదు. తుదకు ఆ వైద్యునకూ ధైర్యం సన్నగిల్లిపోయింది. ఒకనాడతడు రాఘవుని మిత్రులను అవతలికి దీసికొనిపోయి రోగియొక్క వ్యాధి తన శక్తికి మించి పోతున్నదనీ, ఇక నొకటి రెండు వారాలు తిరుగుసరికి ఇతని స్థితియేమగునో తెలియదనీ, మంచి యౌవనంలో ఉండే ఏ ఆరోగ్యవంతమైన శరీరాన్నుంచి అయినా నెత్తురుదీసి దాని నీతని దేహంలో ప్రవేశపెడితే ఒకవేళ బ్రతికితే బ్రతుకవచ్చుననీ తెలియచేశాడు. దానిని విని ఆ స్నేహితులకూ గాళ్లాడాయి కావు. ఇంతవరకూ ఇంటికి దన వార్త నెరిగింప వలదని అతనిచే నివారింప బడియున్న యీ మిత్రులిరువురూ ఇక కాలహరణం చేసినచో ఎటుబోయి ఎటు వచ్చునో యను భయంతో నితనికి దెలియచేయకయే మద్రాసునకు తంతివార్త నంపేరు. రాఘవునికై తపిస్తూ ఉన్న తలిదండ్రులకూ భార్యకూ ఆ వార్త ఆనందదాయకం హృదయవిదారకం గూడా అయింది. ఆనాడే వారందరూ సపరివారంగా బొంబాయికి ప్రయాణమై వెళ్లిపోయినారు.

....

డాక్టరు మహానిపుణుడు. అత్యంతచాకచక్యంతో ఆపరేషను చేసి యౌవనవంతమైన శరీరరక్తాన్ని రాఘవరావుదేహంలో బ్రవేశపెట్టేడు. వారానికల్లా రోగం తిరుగుముఖమైంది. అపాయం దప్పిపోయిం దని అందరూ సంతోషించేరు. చదువరులారా! ప్రాణరక్త మెవరిచ్చిందీ గ్రహించేరా? సాధ్వి జానకి. ఇందుకు కృతజ్ఞతాసూచకంగా నతడామెను 'ప్రాణనాయకీ' అనిపిలుస్తూ ఉంటాడువిల్లప్పుడూ.

'శిథిలంపు జీవనము'

శ్రీమతి పి. అప్పలనరసమ్మ గారు

పుట్టిపెరిగి సుఖమ్ము నెఱుగక
కాలమంతయు గడపుచుంటివి
అడివిలోపల పూసిపెరిగిన
మల్లెపూవు వలెన్.
భరతనారీమణుల పిలిచి
విప్పిచేసిన సంఘమే నీ
సౌఖ్యజీవనమునకు భంగము
సంఘటించినది.

పరుగులెత్తే కాలమున మన
ప్రాతకట్టులు తెగనిగొలుసులు
బిగుసుకొనునే కాని తెగుటకు
రోజులేదేమో?
అమృతమూర్తివి చెల్లి! నీశిథి
లంపుజీవము మామనములలో
బ్రదికినన్నిదినాలు రగులుచు
వెలుగుచుండెడిని.